క్లుప్తంగా

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

వీరపునాయునిపల్లె : స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఉదయం 8 గంటలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో..

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కడపలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

అమ్మవారికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని బొగ్గలేటిపల్లి కొత్తపేట సమీపంలోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.సురేష్ కుమార్‌రెడ్డి అన్న ఏర్పాట్లను చేశారు. భక్తులు కానుకలను సమర్పించుకుని ఆలయ ఆవరణలో విందు భోజనాలు చేశారు.

నేడు మండల సమావేశం

చింతకొమ్మదిన్నె : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో షకీలాబేగం తెలిపారు. శనివారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులతో పాటు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

అథ్లెటిక్స్ చాంపియన్‌కు సన్మానం



రామకృష్ణను సత్కరిస్తున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆదివారం అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనపరచి బంగారు పతకాన్ని సాధించిన మేడా రామకృష్ణను సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ రామకృష్ణ అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 200 మీటర్ల పరుగుపోటీలో బంగారు పతకం సాధించడం గర్వకారణమన్నారు. ఉత్తర ప్రదేశ్ అయోధ్యలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఈ నెల 5న నిర్వహించిన ఈ పోటీల్లో ఆరు దేశాల నుంచి 18 మంది క్రీడాకారులు పాల్గొనగా రామకృష్ణ బంగారు పతకం సాధించారని, ఆయన మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విజయవాడ అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణను ఒంటేరుతోపాటు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో వ్యాయామ శిక్షణా కళాశాల అధ్యాపకులు పంజగల మధుసూదన్‌బాబు, డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత విజయమోహన్‌రెడ్డి, పద్మవీరన్న, సురేష్, జయరాం, కెరోజి పాల్గొన్నారు.

లైబ్రరీని సద్వినియోగం చేసుకోండి

పోరుమామిళ్ల : విద్యార్థులు సెలవు రోజుల్లో గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ ఆఫ్రిది, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్ కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ పాఠశాల సెలవు దినాల్లో విద్యార్థులు తప్పకుండా గ్రంథాలయానికి వచ్చి జనరల్ నాలెడ్జి, కథల పుస్తకాలు, చరిత్ర పుస్తకాలు, దినపత్రికలు చదవాలన్నారు. విద్యార్థుల కొరకు వివిధ రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు.లైబ్రరీకి రావడం వల్ల విజ్ఞానం పెంపొందిచుకోగలరన్నారు.

ఎర్రచందనంపై తనిఖీలు ముమ్మరం

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల రేంజిలో ఎర్రచందనం అక్రమ రవాణాపై తనిఖీలు ముమ్మరం చేసినట్లు రేంజర్ రఘునాథరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అటవీశాఖ మంత్రి ఎర్రచందనంపై సీరియస్‌గా దృష్టి సారించడంతో డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో బృందాలు ఏర్పడి రాత్రిల్లు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు టీమ్‌గా ఏర్పడి వాహనాలు తనిఖీ చేయడం, పాతముద్దాయిల కదిలికలు, బెయిల్‌పై ఉన్న నేరస్తుల కదలికలపై దృష్టి పెట్టినట్లు వివరించారు.

అరచేతి మందారం.. ఆషాఢ సంప్రదాయం

- మహిళల ముచ్చట తీర్చే గోరింట

కడప కల్చరల్ : లేలేత అరచేతుల్లో ఎర్రగా మందారంలా విరబూసిన గోరింటతో పండిన తమ చేతులను చూసుకుని యువతుల బుగ్గలు ఎర్రబడ్డాయి. కాళ్లు, చేతులే కాన్వాస్‌గా కళ్లు చెదిరే కళారూపాలను ఆవిష్కరిస్తుంటాయి. ఆషాఢ మాసంలో యువతులు, మహిళలు ఆశించే గోరింట సౌభాగ్యమది. తెలుగింటి సంప్రదాయ గౌరవాన్ని నిలిపే గోరింట అతివల అరచేతులలో మందార పూల పంట.

భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో గోరింటాకు చాలా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆషాఢ మాసం వచ్చిందంటే అమ్మాయిల చేతులు గోరింటాకు ఎర్రదనంతో మెరిసిపోతాయి. శుభకార్యాలు, పండుగలు వచ్చాయంటే గోరింటాకు లేనిదే సంతోషం ఉండదు. అమ్మాయిలు, స్త్రీలు దీన్ని సౌభాగ్యంగా భావిస్తుంటే ఇంకొందరు సహజ సిద్ధమైన అలంకారంగా భావిస్తున్నారు. దీనికి తగ్గట్టు గోరింటాకుపై సినిమాల్లో పలు సన్నివేశాలు, పాటలు ఉండడంతో యువతులకు దాని పట్ల క్రేజ్‌ను మరింతగా పెంచుతున్నాయి.



మహిళలు గోరింటాకు పెట్టుకున్న దృశ్యం

ఆరోగ్యం.. అలంకారం

జ్యేష్ఠ మాసంలో వానలు మొదలై ఆషాఢం నాటికి వాతావరణం చల్లబడుతుంది. అతి వేడి నుంచి ఒక్కసారిగా చల్లగా మారడంతో శరీరం ఈ మార్పులకు తగినట్లుగా వెంటనే స్పందించకపోతే వ్యాధుల బారిన పడాల్సి వస్తోంది. గోర్లు పుచ్చిపోవడం, విరిగిపోవడం నివారించేందుకు ఈ సీజన్‌లో గోరింటాకు పెట్టుకుంటారు. శరీరంలోని వేడిని తగ్గించి ప్రస్తుత వాతావరణానికి అనుకూలంగా ఉండేందుకు చేతులు, కాళ్లతోపాటు హెన్నాగా గోరింటాకు తలకు కూడా వాడతారు. ఈ సీజన్‌లో గోరింటాకు మొక్కలు ఆకులతో నిండుగా గుబురుగా ఉంటాయి. లేలేత ఆకులను కోసి మెత్తగా దంచి లవంగంతో కలిపి నూరి రాసుకుంటే ఎర్రగా పండుతుందని, ఉసిరిని కలిపి రాసుకుంటే ముదురు ఎరుపు రంగులో ఉంటుందని మహిళలు వీటి మిశ్రమాన్ని చేతులకు వాడుకుంటారు.

ఆధునికత వైపు

మొన్నమొన్నటి వరకు గోరింటాకు ఉచితంగా దొరకుతున్నా శుభకార్యాలు మినహా మిగతా సమయాల్లో వాడేవారు కాదు. ఇటీవలి కాలంలో గోరింటాకు కార్పొరేట్‌స్థాయికి చేరింది. ముందుతరంలో కేవలం శుభ కార్యాల సమయంలో మాత్రమే వాడుతున్న గోరికుంటాకు ఇటీవలి కాలంలో ప్రతి చిన్న ఫంక్షన్లకు కూడా పోటీలు పడి గోరింటాకు అలంకరించుకోవడం ఫ్యాషన్‌గా మారింది. పెద్ద వివాహాల్లో ప్రత్యేకించి 'మెహందీ' పేరిట ఒక రోజంతా కేటాయించి మహిళలతో వేడుకలు నిర్వహిస్తున్నారు. మార్కెట్‌లో కేవలం కోన్‌లు, డబ్బాలలో గోరింటాకు పొడి, హెన్నా మాత్రమే లభించేది. ప్రస్తుతం బ్యూటీ పార్లర్లలో వందలాది డిజైన్లలో నచ్చిన వాటిని ఎంపిక చేసుకుని అరచేతుల నుంచి మోచేతుల వరకు కళ్లు చెదిరేలా కళాత్మకంగా గోరింటాకు పెట్టించుకుంటున్నారు. వీటికోసం కొన్ని కంపెనీలు వేలాది గోరింటాకు డిజైన్లను పుస్తకాలుగా విక్రయిస్తున్నారు. కేవలం గోరింటాకు పెట్టేందుకే బ్యూటీ పార్లర్‌లలో కొన్ని విభాగాలు ఉండడం విశేషం. ఓ పెళ్లికూతురికి గోరింటాకు అలంకరిస్తే రూ.10 వేల నుంచి రూ.50 వేలు తీసుకునే పార్లర్‌లు కూడా ఉన్నాయి. రాజస్తాన్, గుజరాత్ డిజైన్లకు మంచి ఆదరణ లభిస్తోంది. కేవలం మన దేశమేగాక ఇస్లామిక్ దేశాలలో కూడా మహిళలు, యువతులు గోరింటాకును ఇష్టంగా పెట్టుకుంటారు. మరికొన్ని మిశ్రమాలతో గోరింటాకు హెన్నాగా తలకు వాడితే వెంట్రుకలు చిట్లడం, చుండ్రు తగ్గుతుండడంతో హెన్నా వాడకం కూడా ఇటీవల బాగా పెరిగింది. ఇటీవల ట్యాటు ఫ్యాషన్ గోరింటాకు స్థానాన్ని ఆక్రమించగా, తాత్కాలిక ట్యాటుగా గోరింటాకుతో డిజైన్లు వేస్తుండడంతో గోరింటాకు తిరిగి తన స్థానాన్ని నిలబెట్టుకుంటున్నది. ముఖ్యంగా మన దేశంలోని హిందూ, ముస్లింల ఇళ్లలో ప్రతి చిన్న శుభ కార్యానికి గోరింటాకును అలంకరించుకోవడం తప్పనిసరిగా మారింది.

కలవరమాయే మదిలో..

- ప్రారంభమైన ఆషాఢ మాసం
- కొత్త జంటలకు ఎడబాటు
- నెల రోజులు దూరం

కడప కల్చరల్ : ఆషాఢం.. కొత్తగా పెళ్లయిన జంటలకు చిలిపి శత్రువు. పెళ్లయిన వారు జీవిత భాగస్వామి గురించి పూర్తిగా తెలుసుకోకముందే నెల రోజులపాటు వారిని దూరంగా ఉంచే మాసం. అప్పుడప్పుడే కొత్త జీవితంపై ఆశల పందిరిని అల్లుకునే సమయం. అత్తగారింటిని అర్థం చేసుకునేందుకు ప్రయత్నాలు జరిగే సమయం..ఆషాఢ మాసం.

ఆషాఢ మాసం వస్తోందంటే నూతన జంటల మదిలో కలవరం మొదలవుతుంది. నిజానికి ఈ మాసం పేరిట వధూవరుల మధ్య కలిగే ఎడబాటు వారిని మానసికంగా మరింత దగ్గర చేస్తుంది. ఒకరంటే మరొకరు తపించిపోయేలా మారుస్తుంది. ప్రకృతి శరీరాల మధ్య అవగాహనతో పెద్దలు ఆషాఢం ఎడబాటును శాస్త్రీయంగా తప్పనిసరి చేశారు. నెలరోజులపాటు కొత్త జంటకు ఆషాఢ విరహం తప్పదు. వివాహం ద్వారా భౌతికంగా, సామాజికంగా ఒకటి చేసిన సంప్రదాయాన్ని ఆషాఢం మానసికంగా మరింత గట్టి పరుస్తుంది. అత్తాకోడళ్లు ఈ మాసంలో ఒకే ఇంటిలో ఉండకూడదని, ఒకరినొకరు ఎదురవ్వకూడదని పెద్దలు అంటారు.

ఎందుకంటే..

ఆషాఢ మాసం మొదలయ్యే నాటికి వర్షాలు కురుస్తాయి. ఈ తొలకరిలో కొత్త నీరు వస్తుంది. మారుతున్న ఇలాంటి వాతావరణంలో అనుకూల, ప్రతికూల మార్పులను తట్టుకుని నిలవాలన్నదే ఆషాఢంలోనే ఆంతర్యం. కొత్త జంటలలో అమ్మాయి ఈ మాసంలో అత్తగారింట్లో ఉండకూడదన్న సంప్రదాయం బాగా ప్రచారంలో ఉంది. శారీరకంగా, మానసికంగా అప్పుడప్పుడే భర్తకు దగ్గరవుతున్న కొత్త కోడళ్లు ఈ ఎడబాటు ద్వారా కలిగే ప్రేమ వారి భవిష్య జీవితానికి ఎంతో ఉపయోగపడుతుందంటారు. ఈ మాసం నూతన జంటలను కొన్నాళ్లపాటు విడదీసి విరహంలో ముంచుతుందని భావించకుండా వారి మధ్య బంధాన్ని మరింతగా బలపరుస్తుందన్న అవగాహన కలిగి ఉండాలి.

మాసమంతా విరహమే..

కానీ ఈ ఆధునిక కాలపు జంటకు నెలరోజుల పాటు విరహం, బాధ ఉండదు. వివాహమైన నెలరోజులకే ఉద్యోగం చేసే చోట కొత్త కాపురం పెట్టేస్తుండడంతో అత్తాకోడలు ఒకే ఇంటిలో ఉండే నిబంధన వారికి వర్తించదు. దీంతో విరహంలోని తియ్యదనాన్ని నేటితరం జంటలు ఆస్వాదించే అవకాశం లేదు. నెలరోజుల తర్వాత అంటే శ్రావణమాసంలో మెట్టినింటివారు అమ్మాయికి చీర, సారె పెట్టి ఆశీర్వదించి మంగళ ప్రదంగా తమ ఇంటికి తీసుకు వస్తారు. ఇక్కడితో ఆషాఢ మాసపు ఎడబాటు ముగుస్తుంది. ఈ ఏడాది జూలై 6న ప్రారంభమైన ఆషాఢ మాసం ఆగస్టు 4న ముగుస్తుంది. ఆషాఢ మాసమంతా హిందువులు ఎలాంటి శుభకార్యాలు నిర్వహించరు. వివాహాలు తదితర శుభాకార్యాలు ఉండవు గనుక బంగారం కొనరు. నెలరోజుల తర్వాత శ్రావణమాసం రాగానే ఈ విరామానికి తెరపడుతుంది. ఆ తర్వాత రానున్న పండుగలు, వ్రతాలకు తగిన ఏర్పాట్లు చేసుకుంటూ సిద్ధమవుతారు.

ప్రకృతి పరంగా..

వైశాఖ జ్యేష్ఠ మాసాలు శుభ కార్యాలతో కళకళలాడతాయి. ఈనెల 6 నుంచి ఆషాఢ మాసం ప్రారంభమైంది. తెలుగు సంవత్సరంలో నాల్గవ నెల ఆషాఢ మాసం. ఈ నెలలో పౌర్ణమిరోజు చంద్రుడు నక్షత్రాలకు దగ్గరగా వస్తాడు. సంక్రాంతి నుంచి ప్రారంభమైన ఉత్తరాయణాన్ని శుభకార్యాలు, పండుగలకు నెలవుగా పేర్కొంటారు. అందుకే ఈ మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశి పర్వదినంగా, పౌర్ణమిని గురుపౌర్ణమిగా నిర్వహించుకుంటారు. ఆషాఢంలో ఆధ్యాత్మిక వేత్తలు చాతుర్మాస దీక్షలు ప్రారంభిస్తారు. అనంతరం వచ్చే శ్రావణమాసంలో పండుగలు, వ్రతాలు ఉంటాయి. ఈ మాసంలోనే వర్షాలు ప్రారంభమై సూక్ష్మజీవులు పుడతాయని, కొత్త రోగాలను కలగజేసే ప్రమాదముందంటారు.

విభజన హామీల అమలు కోసం పోరాటం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఉమ్మడి రాష్ట్ర విభజన హామీల అమలు కోసం దశల వారి పోరాటానికి సమాయత్తమవుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగిన సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాల్లో దేశం, రాష్ట్రంలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలపై చర్చించడం జరిగిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రాష్ట్ర రాజధాని అమరావతి శంకుస్థాపన కోసం వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ మట్టి, నీళ్లు ముఖాన గొట్టి రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. తరువాత 10 ఏళ్ల ఎన్‌డీఏ పాలనలో బీజేపీకి సొంత బలం ఉండటం వల్ల తాము ఏమీ చేయలేకపోయామని టీడీపీ, వైఎస్‌ఆర్‌సీపీలు చెప్పాయన్నారు. ప్రస్తుతం కేంద్రంలో టీడీపీ మద్దతుతో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఉన్నందు వల్ల విభజన హామీలు అమలు చేసేందుకు మార్గం సుగమం అయిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీ, జాతీయ హోదా కలిగిన పోలవరానికి నిధులు, ఆర్థిక లోటు భర్తీ, నదీ జలాల వివాదం, రాజధాని నిర్మాణం, కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, విశాఖ ఉక్కు పరిరక్షణతో పాటు అసెంబ్లీలో అమరావతి రాజధానిగా ప్రకటిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల వారీగా చంద్రబాబు ప్రకటించిన హామీల అమలుకు డబుల్ ఇంజిన్ సర్కారు శ్రీకారం చుట్టాలన్నారు. ప్రజా సమస్యలపై, పాలక ప్రభుత్వాలు అనుసరించే ప్రజావ్యతిరేక విధానాలపై, సమగ్ర అభివృద్ధికై సమరశీల పోరాటాలకు సమాయత్తం కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.వెంకట శివ, సి.బషీరున్నీషా, సుబ్రహ్మణ్యం, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వారసత్వ స్పృహ కల్పించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న లయన్ కె.చిన్నపరెడ్డి

కడప కల్చరల్ : హైస్కూలు విద్యార్థులకు వారసత్వ స్పృహను కల్పించాలని ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి విద్యాశాఖ అధికారులను కోరారు. ఆదివారం కడప నగరంలోని ఐఎంఏ సమావేశ మందిరంలో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయురాలు జవ్వాజి రమాదేవి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చిన్నపరెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమైందన్నారు. బాల్యం నుంచే పిల్లలకు మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ సంపద గురించి అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో హెరిటేజ్ క్లబ్బులు ఏర్పాటు చేయడంతోపాటు క్షేత్ర స్థాయి పర్యటనలు నిర్వహించాలని సూచించారు. త్వరలో తమ సంస్థ కేంద్ర కార్యాలయం సూచన మేరకు 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు జాతీయ, రాష్ట్ర, జిల్లా, నగర పరిధిలో వారసత్వం గురించి క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల విద్యా శాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు వెంకట్రామిరెడ్డి, రమాదేవి, ప్రధానోపాధ్యాయులు సి.గంగిరెడ్డి, బాలశౌరమ్మ, గడియారం వెంకటేశ్వర్లు, ఉమామహేశ్వరి, వైవీయూ పాలక మండలి సభ్యుడు మూల మల్లికార్జునరెడ్డి, ఎల్లేశ్వర రావు, ఉపాధ్యాయులు, ఇంటాక్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం



మొక్కను నాటుతున్న సొసైటీ సభ్యులు

కడప ఎడ్యుకేషన్ : మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జేకే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు లయన్ పఠాన్ ఖాదర్‌బాషా పేర్కొన్నారు. కడప నకాస్ ముస్లిం శ్మశాన వాటికలో చాంద్ బి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాల ఆవరణంతోపాటు ఖాళీ స్థానాల్లో మొక్కలు నాటాలని పేర్కొన్నారు. జన్మదినం జరుపుకొనే ప్రతి ఒక్కరూ తమ పేరుపైన మొక్కలను నాటాలన్నారు. మొక్కలను నాటడం వల్ల కాలుష్యం తగ్గుతుందన్నారు. చాంద్ బి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పఠాన్ మన్సూర్ అలీఖాన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు జావీద్ అబూబాకర్, షబ్బీర్, మౌలాలీ సయ్యద్, తౌసిఫ్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రొద్దుటూరు : స్థానిక సంజీవనగర్‌లో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి యాడికి రమేష్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు పిచుక బాబు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మానికింది వెంకటేష్ మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ 30 ఏళ్లుగా మాదిగ జాతి ఆకాంక్ష అయిన ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో అనేక పోరాటాలు చేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో మాదిగ అమర వీరులకు జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు చిన్నయ్యమాదిగ, నరసింహులు మాదిగ, ఎంఈఎఫ్ నాయకుడు ఓబయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఆర్.బాలయ్య పాల్గొన్నారు.

బుడగజంగం సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : బుడగజంగం సామాజిక వర్గాల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని బేడ బుడగజంగం సంక్షేమ సంఘం జిల్లా నాయకులు దూపం రాజు జిల్లా కలెక్టర్‌ను కోరారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శివశంకర్‌ను బుడగజంగం సంక్షేమ సంఘ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బుడగ జంగాలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేశారు. 144 జీవో బుడగ జంగాలకు శాపంగా మారిందని, కుల సర్టిఫికెట్లు లేక, ఉద్యోగాలు రాక మానసిక క్షోభకు గురై తమ కులంలో ఎంతోమంది యువకులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు తమ బుడగజంగం కాలనీని సందర్శించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తమ సమస్యలు తెలియపరచి పిల్లల భవిష్యత్తుకు భరోసాగా నిలవాలన్నారు. అందుకు కలెక్టర్ స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

జిల్లా కలెక్టర్‌కు శుభాకాంక్షలు

కడప రూరల్ : జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన లోతేటి శివశంకర్‌ను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పచారం బాలసుబ్బయ్య, కార్యదర్శి ఓబులపతి ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా అన్ని రంగాల్లో ముందుండేలా, ఎస్సీల సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వీఆర్‌ఏలు

ఏపీ జేఏసీ వీఆర్‌ఏల జిల్లా అధ్యక్షులు ఎం.కిరణ్ కుమార్ జిల్లా కలెక్టర్ శివశంకర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

వల్లూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపా ధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి గల రైతులు ఈనెల 20 తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏపీవో డీవీ సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. 5 ఎకరాలు అంతకంటే తక్కువ భూమి కలిగిన చిన్న, సన్నకారు రైతులు 100 శాతం సబ్సిడీతో పండ్ల తోటలను సాగు చేసుకోవడానికి అవకాశం వుందని తెలిపారు. మామిడి, చీనీ, సన్న నిమ్మ, సీతాఫలం, జామ, సపోట, కొబ్బరి, దాని మ్మ, నేరేడు, ఆపిల్ బేర్, డ్రాగన్ ఫ్రూట్ వంటి పండ్ల తోటలు నాటుకుంటే 3 సంవత్సరాల పాటు ప్ర భుత్వం ద్వారా 100 శాతం ఉచితంగా నిర్వహణ చార్జీలు చెల్లించడం జరుగుతుందని తెలపారు. రో జా, మల్లె పూల తోటలు, మునగ తోట సాగు చేసిన రైతులకు రెండు సంవత్సరాల పాటు నిర్వహణా వ్యయం చెల్లించడం జరుగుతుందన్నారు. అదే వి ధంగా నర్సరీలు ఏర్పాటు చేసుకుని మొక్కలను పెంచి ఉపాధి హామీ పథకం కింద తోటలు సాగు చే సుకునే రైతులకు సరఫరా చేస్తే వారికి మూడు నె లల పాటు మొక్కలు పెంచిన చార్జీలు చెల్లించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల రైతులు ఉపాధి హా మీ జాబ్ కార్డు, భూమి పట్టాదారు పాసు పుస్తకం, వన్ బీ, సన్న, చిన్న కారు రైతు పత్రం, జాబ్ కార్డు లో పేరు వున్న వారి ఆధార్ కార్డు జిరాక్స్ ప త్రాల ను తీసుకుని వచ్చి మండల ఉపాధి హామీ కా ర్యాలయంలో ఏపీవోను గానీ, గ్రామ స్థాయిలో టెక్ని క ల్ అసిస్టెంట్‌ను గానీ, ఫీల్డ్ అసిస్టెంట్‌ను గానీ సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఏపీవో తెలిపారు.

కల్యాణ వైభోగమే..

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీ రతనాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేకువజామున వేంకటేశ్వరస్వామి, స్వామివారి చెల్లెలు లలితాదేవి మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు చేసి నూతన పట్టువస్త్రాలు, వెండికవచాలు, రంగురంగుల పూలతో అలంకరించారు. లోకకల్యాణార్థం గణపతి పూజ, విశ్వక్సేనపూజ, గణపతి, నవగ్రహ, వేంకటేశ్వర హోమాలను వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్ణాహుతిగా పూజా, హోమద్రవ్యాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి సుముహూర్తంలో భక్తజనులు ఆసక్తిగా తిలకిస్తుండగా వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య కల్యాణోత్సవాన్ని వైభవోపేతంగా జరిపారు. వేదపండితులు వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని తిలకించడం వల్ల కలగే శుభాలను, స్వామివారి మహిమలను భక్తులకు వివరించారు. ఆలయాన్ని పునఃనిర్మించి అభివృద్ధి చేసిన సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించినట్లు ఆలయ ట్రస్ట్ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి కాయాకర్పూరాలను నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమానంతరం భక్తులకు అన్న ప్రసాద వినియోగం జరిగింది.

శ్వేతపత్రం విడుదల చేయాలి

ప్రొద్దుటూరు : ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆర్థిక బకాయిలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన పీఆర్‌సీ బకాయిలు, డీఏ బకాయిలు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలపై శ్వేతపత్రం విడుదల చేయలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు వీలైనంత త్వరగా ఐఆర్‌ను ప్రకటించాలని, పీఆర్సీ కమిటీని ప్రకటించాలని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన జీఓ 117ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ రీజనల్ కన్వీనర్ డి.సలీమ్, పి.రషీద్‌ఖాన్, పి.రమణారెడ్డి, ఎస్ఎండీ ఇలియాస్ బాషా, వై.సుబ్రహ్మణ్యం, సంజీవరెడ్డి, ఓబుళరెడ్డి, కొత్తపల్లె శీను, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.